క్లుప్తంగా

గంజాయి సాగు నేరం



మాట్లాడుతున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: గంజాయి సాగు నేరమని, ఎవరైనా చేపడితే కఠిన చర్యలు తప్పవని ఏఓ మల్లేష్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని సంగాల, గుండ్రేవుల గ్రామాల్లో బుధవారం ఏఓ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సచివాలయాల్లో రైతులతో ఏఓ సమావేశమయ్యారు. జంగాయి సాగుతో సమాజానికి జరిగే నష్టం, అనారోగ్య సమస్యలు, చట్టపరమైన శిక్షలను ఏఓ వివరించారు. అదేవిధంగా రైతులు వ్యవసాయంలో చేట్టాల్సిన సంరక్షణ, ఆధునిక వ్యవసాయం, యాంత్రీకరణ పద్ధతులను తెలియజేశారు.

గుండెపోటుతో లద్దగిరి వీఆర్వో మృతి



సత్యరాజు కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న తహసీల్దార్

కోడుమూరు రూరల్ : మండలంలోని లద్దగిరి గ్రామ వీఆర్వో సత్యరాజు (59) గుండెపోటుతో మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. వీఆర్వో సత్యరాజు స్వగ్రామం గూడూరు మండలంలోని కె.నాగలాపురం గ్రామం. కోడుమూరు తహసీల్దార్ వెంకటేష్ నాయక్, రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు బుధవారం కె.నాగలాపురం చేరుకుని సత్యరాజు మృతికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మట్టిఖర్చులకు ప్రభుత్వ తరపున తహసీల్దార్ వెంకటేష్ నాయక్ రూ.25వేలను వీఆర్వో కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఉపాధి పనులపై బహిరంగ సమావేశం



పనుల వివరాలు సేకరిస్తున్న అధికారులు

పాణ్యం: 2023–24 సంవత్సరానికి సంబధించి ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సామాజిక బహిరంగా తనిఖీ చేపట్టారు. కొన్ని రోజులుగా పనులకు సంబధించి సోషల్ అడిట్‌సభ్యులు ఆయా గ్రామాల్లో చేసిన పనులను తనిఖీ చేసి గ్రామ సభలు నిర్వహించారు. ఉపాధి పథకం ద్వారా సెర్ప్, హౌసింగ్, ఫారెస్టు, పంచాయితీరాజ్ దారులు, పశుసంవర్ధక తదితర శాఖలకు సంబంధించి చేపట్టిన పనులను ఆడిట్ చేశారు. మండలంలో రూ.3,23,749 రికవరీగా గుర్తించారు. కార్యక్రమంలో పీడీ జనర్దనరావు, ఏపీడీ బాలాజీనాయక్, విజిలెన్స్ అధికారులు శోభరాణి,ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఏపీఓ విజయరాణి తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకుల నిర్మాణ పనుల పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకట రమణయ్య

కల్లూరు: మండల పరిధిలోని ఎ.గోకులపాడు, పర్ల గ్రామాలో పశువుల కోసం నిర్మిస్తున్న మినీ గోకులలను డ్వామా పీడీ వెంకట రమణయ్య బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం, నాణ్యత ప్రమాణాలతో గోకులాలను నిర్మించాలన్నారు. ఆయా గోకులాలను సకాలంలో పూర్తి చేసేలా ఉపాధి సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ లక్ష్మన్న, ఏపీఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష చూపరాదు



లింగ వివక్షతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఓర్వకల్లు: జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రం ఓర్వకల్లులో మహిళలు, బాలికలు, అంగన్‌వాడీ, వెలుగు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్‌టీసీ బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించి లింగ వివక్ష చూపమని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ స్త్రీ, పురుషులు సమానమే అన్నారు. ఎవ్వరూ లింగ వివక్ష చూపరాదని సూచించారు. విద్యాపరంగా బాలికలను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటరామిరెడ్డి, ఈఓఆర్డీ సుబ్బరాయుడు, ఏఎస్ఎం రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు, వెలుగు సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

కొండలను కొల్లగొడుతున్నారు!

- ఏపీఐఐసీ మాటున యథేచ్ఛగా మట్టి దందా
- అధికార బలం చాటున సొమ్ము చేసుకుంటున్న తమ్ముళ్లు
- కర్పూరంలా తరిగిపోతున్న ప్రకృతి సంపద
- పట్టించుకోని అధికారులు



పుట్టగొడుగులపరిశ్రమ వద్ద మట్టి తవ్వకాలు జరుపుతున్న దృశ్యం

ఓర్వకల్లు: అధికారయంత్రాంగం నిర్లక్ష్యం... అక్రమార్కుల చేతివాటం మూలంగా కొండలు పిండి అవుతున్నాయి. అభివృద్ధి చాటున అక్రమాలకు పాల్పడుతున్నారు కొందరు నాయకులు. అధికార పార్టీ నాయకుల అండతో రెచ్చిపోతున్నారు అనుచరులు. ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు చేపడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంతో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతూనే ఉన్నాయి. బడా కాంట్రాక్టర్లను అడ్డుపెట్టుకుని కొంత మంది ప్రైవేట్ వ్యక్తులు అక్రమ మట్టి వ్యాపారాలతో సొమ్ము చేసుకుంటున్నారు. ఏపీఐఐసీ(ఆంధ్రప్రదేశ్ ఇన్‌డస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్టక్చర్స్ కార్పొరేషన్) పేరు చెప్పి మట్టి తవ్వకాలను కొనసాగిస్తున్నారు. అసలు విషయాలను పరిశీలించే అధికారులు కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పరిశ్రమల పేరుతో అక్రమంగా మట్టి తవ్వకాలు

గతంలోనే టీడీపీ ప్రభుత్వం ఓర్వకల్లు ప్రాంతాన్ని ఇండస్ట్రీయల్ కారిడార్‌గా ప్రకటించడంతోపాటు మౌలిక వసతుల కల్పన సంస్థకు సుమారు 10 వేల ఎకరాల ప్రభుత్వ భూములను అప్పగించింది. ఈ మేరకు 2016–17 పూడిచెర్ల, కన్నమడకల, ఓర్వకల్లు గ్రామాల మధ్య 110 ఎకరాల విస్తీర్ణంలో ఎయిర్ పోర్టును స్థాపించారు. ఎయిర్ పోర్టు నిర్మాణ సమయంలో మౌలిక వసతుల కల్పన నిమిత్తం పూడిచెర్ల గ్రామ సమీపంలోని 55, 372 సర్వే నంబర్లలో రెండు కొండల మట్టి తవ్వకాలకు అనుమతించారని అప్పటి బనగానపల్లె ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి బీసీ జనార్ధనరెడ్డి అనుచరులు హల్‌చల్ చేశారు. సీనరైజ్ బిల్లు పేరుతో కొండలను కొల్లగొట్టారనే విమర్శలు అప్పట్లో పెద్దఎత్తున వెల్లువెత్తాయి. ప్రస్తుతం గుట్టపాడు సమీపంలో నెలకొల్పుతున్న స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి 372 సర్వే నంబర్ కొండలో మట్టి త్వకాలు జరుపుతున్నారు. రోజుకు వందల టన్నుల మట్టిని తరలిస్తున్నారు. ప్రభుత్వ నియమనిబంధనలు గాలికి వదిలేశారనే ఆరోపణలు గుప్పుమంటున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు.

రోడ్ల నిర్మాణాల కోసమని తవ్వకాలు

జైరాజ్ ఇస్పాత్ ఆధ్వర్యంలో చేపట్టిన స్టీల్ ప్లాంట్ నిర్మాణ ప్రాంతంలో మరి కొన్ని పరిశ్రమలు వచ్చే అవకాశం ఉండడంతో అంతర్గత రోడ్ల నిర్మాణాలకు ఏపీఐఐసీ టెండర్లు వేశారు. ఇందులో రూ.13 కోట్లకు సుధాకర్‌రెడ్డి, రూ.8 కోట్లకు పైడ్యాల బ్రదర్స్, మరో 2 కోట్లకు గుట్టపాడు మోహన్‌రెడ్డి పనులను దక్కించుకున్నట్లు సమాచారం. అయితే ఒక్క పైడ్యాల బ్రదర్స్ మినహా, మరో ఇద్దరికి మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవని తెలుస్తోంది. మైనింగ్ నిబంధనల ప్రకారం పైడ్యాల బ్రదర్స్ వాహనాలకు సీనరైజ్ బిల్లు ఆటోమేటిక్‌గా మైనిగ్ శాఖ ఖాతాలో జమయ్యేలా అనుమతి తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. మిగతా ఇద్దరు మాత్రం ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్రైవేట్ వాహనాల ద్వారా మట్టిని తరలించి, ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

వ్యక్తిగత నిర్మాణాలకు మట్టి తరలింపు

పరిశ్రమల అభివృద్ధిలో భాగంగా అన్ని రకాల వసతులను కల్పించాల్సిన బాధ్యత ఏపీఐఐసీ ఉంది. ఇందులో భాగంగా అంతర్గత రోడ్లను నిర్మించడం జరుగుతంది. అయితే ఇదే అదనుగా భావించిన కొందరు టీడీపీ మద్దతుదారులు తమ స్వలాభాల కోసం అక్రమ మట్టి తవ్వకాలు జరుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల హుసేనాపురం గ్రామానికి చెందిన టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ముఖ్య అనుచరుడు హుసేనాపురం జాతీయ రహదారి ప్రక్కన దాబా పెట్టుకొని జీవిస్తున్నారు. దాబా అభివృద్ధి కోసం కాల్వ రెవెన్యూ పరిధిలోని పుట్టగొడుగుల ఫ్యాక్టరీ వద్ద మట్టి తవ్వకాలు చేపట్టారనేది బహిరంగ రహస్యం. అయినా అడిగే నాథుడు కరువయ్యారు. అక్రమ మట్టి తవ్వకాలతో ప్రకృతి సంపద రోజురోజుకు హారతి కర్పూరంలా కరిగిపోతుంది.

మా దృష్టికి రాలేదు



మండలంలో అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు మా దృష్టికి రాలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగానే కొందరు కాంట్రాక్టర్లు ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకున్నారు. వారి చాటున అక్రమ మట్టి వ్యాపారాలు చేస్తున్నట్లు తెలిస్తే చర్యలు తప్పవు. ఎలాంటి అనుమతులు ఉన్నాయని పరిశీలించాక చర్యలు తీసుకుంటాం.

– విద్యాసాగర్, తహసీల్దార్, ఓర్వకల్లు

ఇష్టారాజ్యంగా ఎర్రమట్టి తవ్వకాలు



నూతనపల్లె గ్రామంలో ఎర్రమట్టి తరలిస్తున్న దృశ్యం

కర్నూలు (రూరల్) : కర్నూలు మండల పరిధిలోని నూతనపల్లె, బి.తాండ్రపాడు, దిన్నెదేవరపాడు గ్రామాల్లో ఎర్రమట్టి తవ్వకాలు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. అక్రమార్కులు కొండలను పిండి చేస్తున్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దిన్నెదేవరపాడు గ్రామంలో అత్యధికంగా ప్రభుత్వ భూములు ఉన్నాయి. నిత్యం ఎర్రమట్టి తవ్వకాలు జరుగుతూనే ఉంటాయి. 396 సర్వే నంబర్‌లో తవ్వకాలు మితిమీరాయి. అధికార పార్టీ నాయకుల అండదండలతో అనుచరులు ఎర్రమట్టిని కొల్లకొడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తప్పదు అన్నట్లుగా అప్పుడప్పుడు మైనింగ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కొన్ని రోజుల తర్వాతే అదే వ్యక్తులు మళ్లీ అదేప్రాంతంలో తవ్వకాలు చేపడుతున్న తీరు ఇందుకు బలం చేకూర్చుతుంది. అదేవిధంగా నూతనపల్లె సర్వే నంబర్ 200, 180లోనూ ఎర్రమట్టి అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది. అసైన్డ్ పట్టా భూముల లబ్ధిదారులకు తులమో, ఫలమో ముట్టజెప్పి అగ్రిమెంటు చేసుకుని మరీ ఎర్రమట్టి తవ్వుతున్నారు అక్రమార్కులు. ఆయా గ్రామాల వ్యక్తులు ప్రశ్నిస్తే భూమి చదును అంటూ మభ్యపెడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అసైన్డ్ భూములు సాగుకే వినియోగించాలి. ఇందుకు విరుద్ధంగా ఇతరులు మట్టి తవ్వకాలు చేపడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. కర్నూలు నగర సమీప వెంచర్లు, ఇతరత్రా అవసరాలకు ఎర్రమట్టి టిప్పర్ రూ.4 వేలు నుంచి రూ.5 వేలు చొప్పున విక్రయిస్తూ పకృతి సంపదను కొల్లకొడుతున్నారు అక్రమార్కులు. హంద్రీనీవా కాలువ వెంట దిగువపాడు, గార్గేయపురం, నూతనపల్లె, పి.రుద్రవరం గ్రామాల పొలిమేరల్లో మట్టి తవ్వకాలు సాగుతూనే ఉన్నాయి. ఎర్రమట్టి తవ్వాకాల విషయం రెవెన్యూ అధికారుల దృష్టికెళ్లినా స్పందన లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



చిన్నారికి వేసిన టీకాల వివరాలను పరిశీలిస్తున్న వైద్యాధికారి డా.శ్రీమంత్‌మాదన్న

కోడుమూరు రూరల్ : పిల్లలు పుట్టినప్పటి నుంచి 16ఏళ్లు వచ్చే వరకు వ్యాధి నిరోధక టీకాలను తప్పక వేయించాలని కోలోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డా.శ్రీమంత్‌మాదన్న సూచించారు. మండల కేంద్రం కోడుమూరులో బుధవారం జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను క్రమం తప్పకుండా వేయాలన్నారు. దీంతో క్షయ, పోలియో, కోరింత దగ్గు, ధనుర్వాతం, హెపటైటీస్–బి వంటి ప్రమాదకర జబ్బులు దరి చేరవన్నారు. సిబ్బంది కూడా తమ పరిధిలో ఉన్న ప్రతి గర్భిణి పేరును నమోదు చేసి మాతా శిశు సంరక్షణ కార్డును ఇవ్వాలని, ప్రతి పిల్లవాడికి క్రమం తప్పక వ్యాక్సిన్ డోసులు వేయాలని ఆదేశించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించేలా చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్లు కమాల్‌సాహెబ్, ఉమాభాయి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులు పంట నమోదు చేయించుకోవాలి



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏడీఏ సాలురెడ్డి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ హేమసుందర్‌రెడ్డి

కోడుమూరు రూరల్ : రబీ కింద సాగు చేసిన పంటలను ప్రతి రైతు నమోదు చేయించుకోవాలని ఏడీఏ సాలురెడ్డి సూచించారు. మండలంలోని ఎర్రదొడ్డి, అమడగుంట్ల గ్రామాల్లో బుధవారం ఏఓ రవిప్రకాష్ రైతులతో ×పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఏడీఏ మాట్లాడుతూ వేరుశనగ పంట పూత దశలో ఉండగా ఎకరాకు 200కిలోల జిప్సంను చల్లాలన్నారు. అలాగే వేరుశనగలో లద్దెపురుగు నివారణకు ఎకరాకు 10కిలోల తౌడుకు 2కిలోల బెల్లం పాకంగా చేసి 500ఎంఎల్ క్లోరోఫైర్‌పాస్ లేదా కార్బరిల్ 500గ్రాములు కలిపి సాయంత్రం సమయంలో పొలంలో చల్లుకోవాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శనగ పంటలో మొక్కలు ఎండుతుంటే కార్బన్డిజం ఎకరాకు 250గ్రాముల చొప్పున పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ శశిధర్ రెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బీమా ప్రీమియం రైతులే చెల్లించాలి

గడివేముల: రబీ సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంటకు బీమా ప్రీమియం రైతులు చెల్లించాలని ఏఓ హేమసుందర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పెసర వాయి, కరిమద్దెల గ్రామాల్లో బుధవారం ఏఓ పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ పధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంపై రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. దిగుబడి ఆధారిత, వాతావరణ ఆధారిత బీమా పథకాలను తెలియజేయడం జరిగింది.

సోలార్ కేబుల్ దొంగల అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

పాణ్యం: మండల పరిధిలోని కందికాయపల్లె గ్రామ సమీపంలో నిర్మించిన సోలార్ పరిశ్రమలో ఈనెల 25న సుమారు 2వేల మీటర్ల కాపర్‌వైర్‌ను దోచుకెళ్లిన దొంగలను పాణ్యం పోలీసు బుధవారం రాత్రి అరెస్టు చేశారు. సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ చోరీపై కంపెనీ ఉద్యోగి అనుపూరు దానంరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు. నిందితులు దొంగిలించిన కేబుల్‌లో కొంతం వరకు అమ్మి సొమ్ము చేసుకున్నారన్నారు. గ్రామం పొలిమేరలోని పెద్దమ్మ గుడి వద్ద మిగిలిన వైర్‌ను తీసుకెళ్తుండగా అనుమానం వచ్చి విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. మహానంది మండలం ఆంజినేయకొట్టాల గ్రామానికి చెందిన షేక్ ఖాదర్‌వలి, రుద్రవరం మండలం మహదేవాపురం గ్రామానికి చెందిన గోస గుర్రప్ప, కోటుకొండ గ్రామానికి చెందిన దుదేకుల గుర్రప్ప, శ్రీరంగాపురం గ్రామానికి చెందిన పల్లె వెంకటయ్య, నంద్యాల పట్టణం, ఆర్‌టీసీ కాలనీకి చెందిన ముత్తుకూరు ఓబులేసును అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి కాపర్ వైర్, ఏపీ 21టీహెచ్3662నంబర్ ఆటో, మోటార్ సైకిల్, 3 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే వీరిపై పలు కేసులు ఉన్నాయని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నరసింహులు, సిబ్బంది మధుసూధన్, రామాంజి, వెంకటేశ్వర్లు, శ్రీను, కృష్ణ, రాజక్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా వైఎస్సార్ సీపీ

కోడుమూరు రూరల్ : కార్యకర్తలు, నాయకులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ×కుడా' మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. బుధవారం కోడుమూరులో వైఎస్సార్ సీపీ అభిమానులు ఏర్పాటు చేసిన టీ దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కోట్ల హర్ష మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. అయితే ఇలాంటి చర్యలకు ఎవ్వరూ భయపడొద్దని, వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఏ కార్యకర్తకు అవసరమొచ్చినా తాము అందుబాటులో ఉంటామని కోట్ల హర్ష హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కోడుమూరు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ మాదులు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, మాజీ ఉపసర్పంచ్ ప్రవీణ్‌రెడ్డి, నాయకులు రవికుమార్‌రెడ్డి, రాఘవేంద్ర, లింగన్న, లింగమయ్య, లింగమూర్తి, కొత్తపల్లె సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే మంచి భవిష్యత్తు



గూడూరు హైస్కూల్లో విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లను అందజేస్తున్న మహమ్మద్ ఇక్బాల్

కోడుమూరు రూరల్ : పేద విద్యార్థులకు ఉన్నత చదువులతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ, రిటైర్డ్ ఐజీ మహమ్మద్ ఇక్బాల్ సూచించారు. మండల కేంద్రం గూడూరు హైస్కూల్‌లో మున్సిపల్ చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ పీఎస్ అస్లామ్, లక్ష్మన్నలతో బుధవారం ఆయన విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. అలాగే కోడుమూరులోని బాలురు, బాలికల, ఉర్దూ హైస్కూళ్లను ఆయన సందర్శించి విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లతో పాటు, పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని, వాటిని సాధించుకునేందుకు అంకితభావంతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కోడుమూరు ఎంఈఓ తైమూర్‌బాషా, హెచ్ఎం నాగరాజకుమారి, అభివృద్ధి కమిటీ నాయకులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

కర్నూలు: చలికాలంలో ప్రజలు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై ఏపీఎస్పీ కర్నూలు రెండవ బెటాలియన్ ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కర్నూలు శివారులోని ఇండస్ స్కూల్, అశోక ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అసిస్టెంట్ కమాండెంట్ మహబూబ్ బాషా, హెచ్ఎం మీనాక్షి, స్కూల్ డైరెక్టర్ రాజశేఖర్, సీఈఓ విల్సన్‌తో పాటు ఆర్ఎస్‌ఐ మహింద్ర నాయక్ కార్యక్రమానికి హాజరయ్యారు. వరదలు, సునామీ, భూకంపాలతో పాటు చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ×డెమో' ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించి అప్రమత్తంగా ఎలా వ్యవహరించాలో పలు సూచనలు చేశారు.

బాలికలకు ఉచిత నర్సింగ్ విద్య

కర్నూలు(అర్బన్): నగరంలోని న్యూ కృష్ణానగర్ ఆదర్శ మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో బాలికలకు ఉచితంగా నర్సింగ్ విద్యను అందిస్తున్నట్లు కరెస్పాండెంట్ ఈ పద్మాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ ఏ గ్రూప్‌లోనైనా ఉత్తీర్ణులైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకునేందుకు హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనరేట్ ఈ నెల 30వ తేదీ వరకు గడువును పొడిగించిందని పేర్కొన్నారు. జిల్లాలో నర్సింగ్ విద్యపై ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థినులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశం పొందిన విద్యార్థినులకు ఉచిత విద్యతో పాటు హాస్టల్ వసతి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ 9848352725 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పోక్సో కేసు నమోదు

పాణ్యం: సి.బెళగల్ మండలం పోలకల్లు గ్రామానికి చెందిన మల్లెపోగు ఆదిపై పోక్సో కేసు నమోదైంది. నిందితుడు అదే గ్రామానికి చెందిన, పాణ్యం కేజీబీవీ విద్యాలయంలో ఇంటర్ ద్వితీయ సంవ్సతరం చదువుతున్న ఓ బాలికను జూలై 17న బలవంతగా తీసుకు పోయారు. తర్వాత కేజీబీవీ విద్యాలయ సిబ్బంది బాలిక ఆచూకీ కోసం గాలించగా ఎక్కడా లభించకపోవడంతో పాణ్యం పోలీసుస్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టారు. తర్వాత అదే నెల 23వ తేదీన తల్లిదండ్రులు బాలికను కనిపెట్టి తిరిగి కళాశాలలో వదిలారు. నిందితుడు జరిగిన విషయం ఎవరికి చెప్పకూడదని తన కుమార్తెను భయపెట్టినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు మల్లెపోగు ఆదిపై పోక్సో కేసు నమోదు చేశారు. తర్వాత కోర్టులో హాజరు పరచగా 14రోజుల రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ చెప్పారు.

సూర్య ఘర్ యోజనపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న శేషాద్రి

ఓర్వకల్లు: కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై అధికారులు అవగాహన కల్పించారు. బుధవారం మండలంలోని పూడిచెర్ల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ శేషాద్రి ఇళ్లల్లో వినియోగించే విద్యుత్, సోలార్‌కు సంబంధించిన రాయితీలను వివరించారు. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు పూర్తిగాను, ఇతరులకు రాయితీలపై విద్యుత్‌ను సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంతారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలలో వెండి పతకం



వెండి పథకం అందుకుంటున్న క్రీడాకారులు శ్రీనువాసులు, రవి

కర్నూలు(రూరల్): రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లాకు చెందిన విద్యార్థులు వెండి పతకం సాధించారు. బాపట్ల సూర్యలంకలో బీచ్‌లో మంగళవారం, బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–14 బీచ్ వాటీబాల్ పోటీలలో ఈ.తాండ్రపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి శ్రీనువాసులు, పులకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రవి ప్రతిభ చాటారు. రన్నర్ స్థానంలో వెండిపతకం సాధించారు. పోటీల అబ్జర్వర్ రజనీ నాయక్, టోర్నమెంటు కన్వీనర్ కరిముల్ల చేతుల మీదుగా వీరు వెండిపతకం అందుకున్నారు.

ఇళ్ల స్థలాల కోసం ధర్నా



ఆందోళన చేపట్టిన సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): పట్టణాల్లోని పేదలకు 2 సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ ఆందోళనకు దిగింది. బుధవారం నగరంలోని 46, 48, 50, 53వ సచివాయాల ఎదుట ఆ పార్టీ నేతల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఇళ్ల స్థలాలతో పాటు నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని అడ్మిన్లకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల హామీ మేరకు పట్టణంలోని నిరుపేదలకు రెండు సెంట్ల ఇంటి స్థలంతోపాటు రూ.5 లక్షల రూపాయలు నిర్మాణం కోసం మంజూరు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ ఏర్పడి 6 నెలలు కావొస్తున్నా ఒక్కరికీ ఇంటి స్థలం ఇవ్వలేదని వాపోయారు. కార్యక్రమంలో సి.మహేష్, పార్థసారథి, కుమార్‌రాజా, సులోచనమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కోడుమూరు రూరల్ : ఉపాధి పథకం కింద చేపట్టే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఏపీడీ పక్కీరప్ప సూచించారు. బుధవారం మండలంలోని వెంకటగిరి, ముడుమలగుర్తి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీడీ తనిఖీ చేశారు. ఉపాధి కూలీల హాజరు, మస్టర్లను పరిశీలించారు. ఏపీడీ మాటాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం కూలీలు పనులు చేస్తే రోజువారీ వేతనం రూ.300లు పడుతుందన్నారు. అయితే కూలీలు కొలతల ప్రకారం పనులు చేయడం లేదని, టెక్నికల్ అసిస్టెంట్లు కొలతలు వేసి ప్రతి రోజు కూలీలు పనులు చేసేలా చూడాలని ఆదేశించారు. గ్రామాల్లో పనులు అవసరమైన కూలీలు ముందుకొస్తే కల్పిస్తామన్నారు.

నేడు రామదాసు స్వామి రోథత్సవం

కోడుమూరు రూరల్ : మండలంలోని లద్దగిరి గ్రామంలో వెలసిన శ్రీరామదాసు స్వామి తిరునాల ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి రథోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రథోత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారు. తిరునాల ఉత్సవాల్లో భాగంగా బుధవారం నందికోల సేవా కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు.